ప్రతి కుటుంబానికీ లబ్ధి

- ప్రజా సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యత
- అవినీతి పరులకు జైలు శిక్ష తప్పదు
- రూ. 75 లక్షలతో నిర్మించిన కల్వర్టు, సీసీ రోడ్డును ప్రారంభించిన ఎమ్మెల్యే కాటసాని, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల



రూ. 55 లక్షలతో నిర్మించిన కల్వర్టును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాటసాని, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల

కోవెలకుంట్ల: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జనరంజక పాలన కొనసాగిస్తున్నారని, ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు వర్తింపజేసి లబ్ధి చేకూరుస్తున్నారని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి గుర్తు చేశారు. మండల పరిధిలోని అమడాల గ్రామ శివారులో జుర్రేరు వాగుపై రూ. 55 లక్షలతో నిర్మించిన కల్వర్టు, రూ. 20 లక్షలతో ఏర్పాటు చేసిన సీసీ రోడ్డును శుక్రవారం ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్ ప్రారంభించారు. కార్యక్రమానికి ఏపీ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కర్రా గిరిజ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రా హర్షవర్ధన్‌రెడ్డి, ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కరుణాకర్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ బీవీ నాగార్జునరెడ్డి, మేజర్ గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ అవుకు మండల అధ్యక్షుడు కాటసాని తిరుపాల్‌రెడ్డి, రాష్ట్ర యువజన కార్యదర్శి పోచా శీలారెడ్డి, పోచా వెంకట్రామిరెడ్డి, న్యాయ విభాగ జిల్లా కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రాంమోహన్‌రెడ్డి, భీమిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, శంకరయ్య, ఎల్‌ఐసీ రామసుబ్బారెడ్డి తదితరులు హాజరయ్యారు. అనంతరం సర్పంచ్ బాలమద్దిలేటి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యతనిస్తూ గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తోందన్నారు. విద్య, వైద్య రంగానికి ప్రాధాన్యత ఇచ్చి నాడు- నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రులను తీర్చిదిద్దిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. కార్పొరేట్ పాఠశాలలు, ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రుల రూపురేఖలు మార్చారన్నారు. పేదల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో స్పెషలిస్టు డాక్టర్ల ద్వారా ఇళ్ల ఇద్దకే కార్పొరేట్ వైద్యాన్ని అందిస్తున్నారని పేర్కొన్నారు. గత నాలుగున్నర సంవత్సరాలుగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మంచి పనులు చేస్తుంటే టీడీపీ నాయకులు జీర్ణించుకోలేక విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. గత టీడీపీ హయాంలో నీరు-చెట్టు పేరుతో ఆ పార్టీ నాయకులు కోట్లాది రూపాయలు స్వాహా చేశారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక టీడీపీ హయాంలోని పెండింగ్‌లో ఉన్న రూ. 40 వేల కోట్ల రూపాయాల బిల్లులు విడుదల చేసిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రభుత్వ సొమ్మును దోపిడి చేసి చంద్రబాబు జైలు జీవితం గడుపుతున్నాడని, చట్టం, న్యాయం ముందు అందరూ సమానమేని, తప్పు చేసిన వారికి శిక్ష తప్పదన్నారు. చంద్రబాబు అవినీతికి పాల్పడలేదని బాబు లాయర్లు కోర్టుల్లో వాదించకుండా గవర్నర్ అనుమతి లేకుండా అరెస్ట్ చేశారని వాదిస్తుండటం విడ్డూరమన్నారు.

అభివృద్ధిలో అగ్రగామిగా అమడాల

అమడాల గ్రామాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుతామని ఎమ్మెల్యే కాటసాని తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించగా గ్రామస్తులు, రైతులు జుర్రేరు వాగుపై వంతెన లేక ఇబ్బందులు పడుతున్నామని తమ దృష్టికి తెచ్చారన్నారు. రూ. 55 లక్షల నిధులు కేటాయించి ఏళ్లనాటి సమస్యను పరిష్కరించామన్నారు. వాగు నుంచి బిజనవేముల వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి మరో రూ. 15 లక్షలు నిధులు మంజూరు చేశామన్నారు. గ్రామ శివారులోని ఎస్సార్బీసీ అసంపూర్తిగా ఉందని, కాల్వను కుందూనదివరకు పొడగించాలని రైతులు కోరుతున్నారని, కాల్వ పొడగింపునకు సాంకేతిక సమస్యలున్నా సాధ్యమైనంత వరకు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల్లో వర్షాలు కురియకపోవడంతో శ్రీశైలం జలాశయంలో పూర్తిస్థాయిలో నీటిమట్టం లేదన్నారు. దీంతో పదిరోజులకోసారి మాత్రమే నీటిని విడుదల చేస్తున్నామన్నారు. వర్షాలు కురిసే వరకు రైతులు ఈ పరిస్థితిని అర్థం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు ఎల్వీ సుధాకర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రఘునాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటేశ్వరరెడ్డి, సంఘం సుధాకర్‌రెడ్డి, పుల్లారెడ్డి, మునిస్వామిరెడ్డి, జగదీశ్వరరెడ్డి, మహేశ్వరరెడ్డి, కంబగిరి, కుళాయప్ప, పెద్ద గుర్రప్ప, డీవీ శేషిరెడ్డి, మోహన్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, వీరారెడ్డి, రాంశంకర్‌రెడ్డి, సుబ్బరాయుడు, శ్రీనివాసనాయక్, నరసింహారెడ్డి, గజ్జెలరెడ్డి, దశరథరామిరెడ్డి, గువ్వల రామకృష్ణారెడ్డి, గోనవరం రామసుబ్బారెడ్డి, పంచాయతీ రాజ్ డీఈ నాగశ్రీనివాసులు, ఎంపీడీఓ సయ్యదున్నీసా, ఈఓపీఆర్‌డీ రాధిక, పంచాయతీ రాజ్ ఏఈ చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

కౌలురైతు ఆత్మహత్య

అవుకు: మండల పరిధిలోని సంగపట్నం గ్రామానికి చెందిన మంగలి మహేష్(34)ఆత్మహత్యకు పాల్పడ్డాడని హెడ్ కానిస్టేబుల్ గోపాల్ శుక్రవారం తెలిపారు. ఆయన వివరాల మేరకు మహేష్ ఐదు ఎకరాలను కౌలుకు తీసుకొని మిరప సాగు చేశాడు. పంట పూర్తిగా దెబ్బతినింది. రూ.10లక్షలు అప్పు చేశాడు. మనస్తాపానికి గురై గురువారం ఇంటిలోనే ఫ్యానుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.కుమార్తె సమాచారం మేరకు కుటుంబ సభ్యులు, స్థానికులు అతడిని కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్తుండగా తరలించారు. అయితే మార్గమధ్యలోనే మృతి చెందాడని డాక్టర్లు నిర్ధారించారు. మృతునికి ఒక కుమారుడు, కుమార్తె. మృతుని భార్య మంగలి మంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని కోటపాడు ఎస్సీ కాలనీకి చెందిన నాగరాజు(33) కోలుకోలేక మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కుటుంబ సమస్యల కారణంగా ఈనెల 10న ఇంట్లో నాగరాజు క్రిమిసంహారక మందు సేవించి అపస్మారక స్థితిలో పడిపోయాడు. కొద్ది సేపటి తర్వాత కుటుంబ సభ్యులు గమనించి చికిత్స కోసం మొదట జమ్మలమడుగుకు, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కడపకు తీసుకెళ్లారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

నాటుసారా విక్రేత అరెస్టు

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్ కొత్తపల్లె గ్రామంలో నాటుసారా విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు ఎస్ఐ శివ శంకర్ నాయక్ శుక్రవారం తెలిపారు. నాగ మద్దయ్య నుంచి 20 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడిని అరెస్టు చేసి డోన్ కోర్టుకు రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ చెప్పారు.

క్లుప్తంగా

ఘనంగా శ్రీ చౌడేశ్వరిదేవి పల్లకీ సేవ



బనగానపల్లె రూరల్ : మండలంలోని నందవరంలో వెలసిన శ్రీ చౌడేశ్వరిదేవి ఆలయంలో శుక్రవారం అమ్మవారి పల్లకీ సేవ ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయ కార్యనిర్వాహణాధికారి రామానుజన్, అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమార్చన అభిషేకం తదితర పూజలు జరిగాయి. సాయంత్రం శ్రీ చౌడేశ్వరిదేవి ఉత్సవ విగ్రహాలకు పల్లకీ సేవ సంప్రదాయబద్ధంగా నిర్వహించారు.

ఉపాధి పనులను గుర్తించాలి

బేతంచెర్ల: ఉపాధి పనులు గుర్తింపును వేగవంతం చేయాలని జిల్లా నీటియాజమాన్య సంస్థ అధికారి భాస్కర్ నాయుడు అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఏపీఓ శేషన్న ఆధ్వర్యంలో కంప్యూటర్ ఆపరేటర్లు, టెక్నికల్ అసిస్టెంట్స్‌తో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే ప్రారంభించిన పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలకు నీటి వసతి, రక్షణ ఏర్పాటు చేయాలన్నారు. 2024 సంవత్సరానికి కొత్త పనులు గుర్తింపు కార్యక్రమం త్వరగా పూర్తి చేయాలని, డిసెంబర్ 15 నాటికి పనులన్నీ సిద్ధం చేయాలని ఉపాధి సిబ్బందిని ఆదేశించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు కానాల విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం అరుణ కుమారి, ఉపాధ్యాయులు

సంజామల: నంద్యాలలో జరిగిన స్కూల్‌గేమ్స్ జిల్లా స్థాయి పోటీలలో మండల పరిధిలోని కానాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. అండర్-17 షెటిల్ బ్యాడ్మింటన్‌లో సంధ్యారాణి, అండర్-14 రోప్ స్కిప్పింగ్‌లో బషరున్ ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయారని ప్రధానోపాధ్యాయులు అరుణ కుమారి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం విద్యార్థులను ప్రధానోపాధ్యాయురాలితోపాటు వ్యాయామ ఉపాధ్యాయుడు మౌలాలిని,ఉపాధ్యాయులు అభినందించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ


చెక్కు అందజేస్తున్న ఎంపీపీ, నాయకులు

డోన్ టౌన్ : పేద ప్రజల ఆరోగ్యమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి అన్నారు. పట్టణంలోని తారకరామనగర్‌కు చెందిన మంగలి చిట్టి అనే వ్యక్తికి సీఎం రిలీఫ్ ఫండ్ రూ.36వేలు మంజూరైంది. ఈ మేరకు శుక్రవారం స్థానిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి స్వగృహంలో బాధితునికి మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్ హుస్సేన్, కో ఆప్షన్ సభ్యులు రఫీ, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పోస్టు ప్రసాద్‌లతో కలిసి ఎంపీపీ అందజేశారు.

సమైక్యత భావం కోసం నామట్టి- నా భూమి


మట్టి, కలశం, నీరు అందజేస్తున్న నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి

బేతంచెర్ల: ప్రజల్లో సమైక్యత భావం పెంచడం కోసం నామట్టి- నా భూమి అనే కార్యక్రమానికి ప్రధాన మంత్రి శ్రీకారం చుట్టారని నగర పంచాయతీ కమిషనర్ రమేష్ బాబు, చైర్మన్ చలం రెడ్డి అన్నారు. బేతంచెర్ల నగర పంచాయతీ నుంచి కోడె వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ కార్యాలయం నుంచి ఏపీఓ శేషన్న ఢిల్లీకి శుక్రవారం బయలు దేరారు. ఈనెల 30, 31 తేదీలలో ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో వారు పాల్గొంటారన్నారు. ఈసందర్భంగా కమిషనర్ రమేష్ బాబు, చైర్మన్ చలం రెడ్డి , ఇన్‌చార్జ్ ఎంపీడీఓ దస్తగిరి బాబు మట్టి, కళశం, నీరును ఢిల్లీకి వెల్తున్న వారికి అందజేశారు.

సచివాలయాల్లో ఆధార్ సేవలు

సంజామల: ప్రజకు ఆధార్ సేవలు అందుబాటులో ఉండాలని ప్రభుత్వం సచివాలయంలో సేవలు అదిస్తుంది. అకుమల్ల,కానాల సచివాలయాల్లో శుక్రవారం నిర్వహించిన ఆధార్ ప్రత్యేక క్యాంప్‌లో ఆధార్ నమోదు, మార్పులు, చేర్పులు ప్రజలు చేయించుకున్నారు. 30 మంది ఆధార్ సేవలు వినియోగించుకున్నారని ఎంపీడీఓ నాగకుమార్ తెలిపారు. నెలకోసారి నిర్వహించే ఆధార్ ప్రత్యేక క్యాంప్ ప్రజలు వినియోగించుకోవాలని ఆయన తెలిపారు.

పంట నమోదులో తప్పులు సరి చేసుకోవాలి


గ్రామసభలో మాట్లాడుతున్న అశోక్‌వర్ధన్‌రెడ్డి

డోన్ రూరల్ : పంట నమోదులో రైతుల వివరాలలో ఏమైనా తప్పులు ఉంటే సరి చేసుకోవాలని ఏడీఏ అశోక్‌వర్ధన్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని యు.కొత్తపల్లి గ్రామం రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం ఏఓ అబ్దుల్‌షఫి ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా హాజరై ఏడీఏ మాట్లాడుతూ పంటలకు సంబంధించి రైతులు వివరాలన్నింటినీ నమోదు చేయడం జరిగిందని, జాబితాలలో పరిశీలించుకోవాలని సూచించారు. రైతు భరోసా కేంద్రాలలో ఈనెల29 వరకు జాబితాను ప్రదర్శించడం జరుగుతుందన్నారు. అనంతరం సమాజిక రైతుల జాబితాను రైతు భరోసా కేంద్రంలో ప్రదర్శించారు.

బేతంచెర్ల: పట్టణంలోని 2వ రైతు భరోసా కేంద్రంలో ఈఏడాది ఖరీఫ్ పంటల సాగు నమోదుకు సంబంధించి సామాజిక తనిఖీ చేసిన వాటిపై రైతులతో ఏఓ కిరణ్ కుమార్ సమావేశం నిర్వహించారు. రైతులకు పంట నమోదు చేసిన జాబితాను రైతుల సమక్షంలో వినిపించారు. ఏవైనా ఫిర్యాదులు ఉంటే రాతపూర్వకంగా సమర్పిస్తే సవరణలు చేస్తామన్నారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ కళ్యాణి, రైతులు పాల్గొన్నారు.

వ్యాపారి అదృశ్యం

డోన్ టౌన్ : పట్టణంలోని తారకరామనగర్‌కు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే ఓ యువకుడు ఐదు రోజులుగా అజ్ఞాతంలోకి వెళ్లినట్లు పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. ఓ గ్రామం నుంచి వచ్చిన ఇతను రియల్ ఎస్టేట్ వ్యాపారం, ఇండ్లు కట్టడం, అమ్మడం చేపట్టేందుకు ఇతరుల నుంచి దాదాపు రూ.6 కోట్ల వరకు అప్పు చేసినట్టు ప్రచారం ఉంది. ఇతను ఇటీవల తనకు చెందిన ఇంటిని పలువురికి విక్రయించి ఒక్కరికి మాత్రమే రిజిష్టరు చేయించిన విషయం ప్రచారం కావడంతో అడ్వాన్సు ఇచ్చిన వ్యక్తుల ఒత్తిడి పెరిగింది. గుర్రం పందెలా కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్లేవాడనే ప్రచారం జోరుగా సాగుతోంది. అప్పులు ఎక్కువై ఐపీ పెట్టేందుకు అజ్ఞాతంలోకి వెళ్లాడనే చర్చ జోరుగా సాగుతోంది. ఇతనికి పట్టణంలోని వడ్డీ వ్యాపారస్తులతో పాటు అధిక భాగం సొంత గ్రామానికి చెందిన వారి నుంచి లక్షల్లో అప్పులు చేసినట్లు తెలిసింది.

మౌలాలి స్వామికి పూజలు

ప్యాపిలి: మండల పరిధిలోని చంద్రపల్లి గ్రామంలో వర్షం కోసం శుక్రవారం మౌలాలి స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన రైతులు అరటి సాగు చేశారు. ప్రస్తుతం మార్కెట్‌లో అరటి ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. అయితే వర్షాభావం కారణంగా భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో బోర్లు ఎండిపోయే పరిస్థితి నెలకొంది. దీంతో రైతులు చందాలు వేసుకుని మౌలాలి స్వామి దర్గాలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సర్పంచ్ జొన్నగిరి సరోజమ్మ ఆధ్వర్యంలో మౌలాలి స్వామి పీరును గ్రామ ప్రధాన వీధుల మీదుగా ఊరేగింపు నిర్వహించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి సాగు, తాగు నీటికి ఇబ్బందులు లేకుండా చూడాలని వారు మౌలాలి స్వామిని వేడుకున్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు కృష్ణారెడ్డి, వార్డు మెంబర్ కేకే రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ రద్దు

డోన్ టౌన్ : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న ఇంగ్లిష్ గెస్ట్ ఫ్యాకల్టీ లెక్చరర్ నియామకానికి శనివారం నిర్వహించాల్సిన ఇంటర్వ్యూ రద్దు అయ్యిందని కళాశాల ప్రిన్స్‌పాల్ భారతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రద్దు చేయాల్సి వచ్చిందని, ఇంటర్వ్యూకు ఎవ్వరూ రావద్దని సూచించారు. తిరిగి ఇంటర్వ్యూ నిర్వహించే తేదీని త్వరలో ప్రకటిస్తామన్నారు.

30న భరద్వాజ మాస్టర్ జయంతి

డోన్ టౌన్ : పట్టణ సమీపంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో ఉన్న శ్రీ పోలికి వర చిదంబర స్వామి సన్నిధిలో శ్రీభరద్వాజ్ మాస్టర్ జయంతి వేడుకలను ఈ నెల 30వ తేదిన ఘనంగా నిర్వహించనున్నట్లు సంస్థాన్ కమిటీ సభ్యులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం నుంచి పోలికి వర చిదంబర స్వామికి, భరద్వాజ మాస్టర్లకు ప్రత్యేక అలంకరణ, అభిషేకాలు, పూజలు నిర్వహిస్తామన్నారు.

ధోబీ ఘాట్ నిర్మాణ పనులు ప్రారంభం

కొలిమిగుండ్ల: రజకుల సౌకర్యం కోసం చింతలాయిపల్లెలో ధోబీ ఘాట్ నిర్మాణ పనులు ప్రారంభించినట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి శుక్రవారం తెలిపారు. ధోబీ ఘాట్ ఏర్పాటుకు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి రూ.10 లక్షలు మంజూరు చేయించారన్నారు. గ్రామంలో 70 కుటుంబాలకు పైగానే రజకులు ఉన్నారన్నారు. నీటి సౌకర్యం లేక పోవడంతో పాటు తిమ్మనాయినపేట చెరువు, నాపరాతి గనుల్లోకి వెళ్లి బట్టలు ఉతకాల్సి వచ్చేదన్నారు. బోరు ఏర్పాటు చేసి విద్యుత్ సౌకర్యం కల్పించి ధోబీ ఘాట్ నిర్మాణం చేపట్టామన్నారు. ఇరవై రోజుల్లో పనులు పూర్తి చేస్తామన్నారు.

బహిరంగ వేలంలో ఆలయానికి ఆదాయం

బనగానపల్లె రూరల్ : మండలంలోని యాగంటి క్షేత్రంలోని ఉమామహేశ్వరస్వామి ఆలయంలో కొబ్బరి చిప్పల పోగు చేసుకునేందుకు నిర్వహించిన బహిరంగ వేలం ద్వారా ఆలయానికి రూ.2.30 లక్షల ఆదాయం వచ్చిందని ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆలయ పర్యవేక్షణాధికారి హరిచంద్రారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ బహిరంగవేలంలో మొత్తం 6 మంది పాటదారులు పాల్గొన్నారు. పాతపాడు గ్రామానికి చెందిన చిన్నసుబ్బరాయుడు అత్యధికంగా రూ.2.30లక్షలకు వేలంపాడి దక్కించుకున్నారు. తలనీలాలు బహిరంగ వేలానికి సరైయన ధర రాకపోవడంతో వాయిదా వేసినట్లు ఈఓ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ తొటబుచ్చిరెడ్డి, అర్చకులు మహేష్‌శర్మ, సత్యమయ్య తదితర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి జగనన్న భరోసా


వైద్య శిబిరంలో కంటి అద్దాలు అందజేస్తున్న ఏపీ ఐడీసీ చైర్‌పర్సన్ కర్రా గిరిజా హర్షవర్ధన్‌రెడ్డి


మందులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ రంగమ్మ, డాక్టర్లు


వృద్ధుడికి ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్

కోవెలకుంట్ల: ప్రజారోగ్యానికి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి భరోసాకల్పిస్తున్నారని, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో ఉచితంగా వైద్య పరీక్షలతోపాటు మందులు అందజేస్తూ అండగా నిలుస్తున్నారని ఏపీ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కర్రా గిరిజా హర్షవర్ధన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని గుళ్లదూర్తి గ్రామ సచివాలయ పరిధిలో వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరాన్ని సందర్శించిన కర్రా గిరిజా హర్షవర్ధన్‌రెడ్డి ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని గ్రామస్థాయిలో ఉచితంగా అందిస్తూ పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసా కల్పిస్తోందని ఈ సందర్భంగా ఆమె గుర్తు చేశారు. పొట్టిపాడు, గుళ్లదూర్తి గ్రామాలకు చెందిన 641 మంది ఓపీ నమోదు చేసుకున్నారు. కోవెలకుంట్ల సీహెచ్‌సీ, రేవనూరు, ఉయ్యాలవాడ పీహెచ్‌సీ డాక్టర్లు వెంకటలక్ష్మి, మెహజబీన్, విద్యాసాగర్, వెంకటసుబ్బయ్య 332 మంది మహిళలు, 309 మంది పురుషులకు వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రా హర్షవర్ధన్‌రెడ్డి, దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు నాగార్జునరెడ్డి, ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కరుణాకర్, తహసీల్దార్ పుష్పకుమారి, ఎంపీడీఓ సయ్యదున్నీసా, ఎంఈఓ వెంకటసుబ్బయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గీతాలక్ష్మి పాల్గొన్నారు.

బనగానపల్లె : మండలంలోని తిమ్మాపురంగ్రామంలో శుక్రవారం ఎంపీడీఓ శివరామయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. డాక్టర్లు లక్ష్మీ, శివశంకరుడు మంగ్యానాయక్, సోహెల్‌బాబు, రాఘవేంద్రరెడ్డి 672 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరం మేరకు ఉచితంగా మందులు పంపిణీ అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ అల్లె సుప్రజ, వైఎస్సార్‌సీపీ నాయకులు అల్లె సురేష్‌రెడ్డి, జిల్లా వైఎస్సార్‌సీపీ రైతు విభాగం అధ్యక్షులు శివరామిరెడ్డి, ఈఓఆర్‌డీ గురుప్రసాద్, ఎంపీహెచ్‌ఈఓ సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

డోన్ రూరల్ : మండల పరిధిలోని కొత్తకోట గ్రామంలో శుక్రవారం ఎంపీడీఓ శ్రీనివాసులు ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంప్ నిర్వహించారు. డాక్టర్లు ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. వైద్యశిబిరాన్ని సర్పంచ్ సర్పంచ్ సుధర్శన్‌రెడ్డి పరిశీలించారు. రోగులతో మాట్లాడి అందుతున్న సేవలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు చంద్రన్న, డాక్టర్ హెమంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్యాపిలి: మండల పరిధిలోని పోతుదొడ్డి గ్రామంలో శుక్రవారం ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్, సర్పంచ్ రంగమ్మ ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంప్ నిర్వహించారు. డాక్టర్లు 505 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ జగదీశ్వంద్రారెడ్డి, వైద్యులు ఇంతియాజ్ ఖాన్, వాణిశ్రీ, సహృదయ్, దుర్గ, మౌనిక, కాంతారావు నాయక్, శ్రీమంత్, వైద్య సిబ్బంది మనోహర్ రెడ్డి, విజయ కుమారి, గంగాదేవి తదితరులు పాల్గొన్నారు.

బుడగ జంగాల సమస్యల పరిష్కారానికి చర్యలు


ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డిని కలిసిన అవుకు పట్టణ బుడగ జంగాల ప్రజలు

బనగానపల్లె రూరల్ : అవుకు పట్టణంలోని బుడగ జంగాల కాలనీకి చెందిన పెద్ద జంబయ్య, ఉసేని, ఖాసీం, పుల్లయ్య, పెద్దయ్య తదితర సుమారు వంద మంది శుక్రవారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డినిని ఆయన స్వగృహంలో కలిసి సమస్యలు విన్నవించారు. దాదాపు తమవి 120 కుటుంబాలు ఉన్నాయని, రేషన్‌కార్డులు, ఆధార్ కార్డులు, ఇంటి స్థలంతో పాటు గృహ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యేను కోరారు. స్పందించిన ఎమ్మెల్యే సమస్యలను పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు వాయునందగౌడ్, చిన్నస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఫాతెహాలు సమర్పించిన ఎమ్మెల్యే కాటసాని


దస్తగిరిస్వామికి పూల చాదర్ సమర్పిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె రూరల్ : పట్టణంలోని బేతంచర్ల రోడ్డులో ఉన్న శ్రీ దస్తగిరి స్వామి దర్గా ఉరుసు సందర్భంగా శుక్రవారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి స్వామి వారికి ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు. ముందుగా దర్గా పీఠాధిపతి అబ్దుల్ హుస్సేన్ సాహెబ్‌ఖాద్రీని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కలిసి సన్మానించారు. దర్గాలోని శ్రీ దస్తగిరి స్వామికి పూలచాదర్ సమర్పించారు. అనంతరం ఎమ్మెల్యే కాటసానిని దర్గా పీఠాధిపతి అబ్దుల్ హుస్సేని ఖాద్రి సాహెబ్ సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి, జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ ఉమ్మడి జిల్లాల ప్రచార విభాగం జోనల్ ఇన్‌చార్జ్ పోచా శిలారెడ్డి, మాబుసా, కలాం తదితరులు పాల్గొన్నారు.

ఈరోజు

నేడు తిమ్మనాయినపేటలో వైద్య శిబిరం

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని తిమ్మనాయినపేటలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. సాధారణ జబ్బులతో పాటు అన్ని రకాల వ్యాధులకు స్పెషలిస్టు వైద్యులు చికిత్స చేసి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని చెప్పారు. ప్రజలు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

వాల్మీకి జయంతి

కొలిమిగుండ్ల: వాల్మీకుల ఆరాధ్యదైవమైన వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. కొలిమిగుండ్లలోని లలితా సుందరేశ్వరస్వామి ఆలయంలో, మీర్జాపురం గ్రామంలో వాల్మీకి జయంతి వేడుకలు నిర్వహించనున్నారు. కొలిమిగుండ్లలో సాయంత్రం మహర్షి విగ్రహానికి మేళతాళాలతో గ్రామోత్సం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు చెప్పారు. వాల్మీకులు తరలివచ్చి కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

ఆధార్ ప్రత్యేక క్యాంప్

సంజామల: మండల పరిధిలోని అల్వకొండ, గిద్దలూరు గ్రామాల సచివాలయాల్లో శనివారం ఆధార్ ప్రత్యేక క్యాంప్‌లు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నాగకుమార్ తెలిపారు. ప్రత్యేక క్యాంప్‌లో ఆధార్ నమోదు, మార్పులు, చేర్పులు తదితర సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఒక్క రోజు జరిగే ప్రత్యేక క్యాంప్‌ను ఆయా సచివాలయాల పరిధిలోని అల్వకొండ, రెడ్డిపల్లె, గిద్దలూరు, మంగపల్లె గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సూచించారు.

పసుపలలో హెల్త్ క్యాంప్

బనగానపల్లె : మండలంలోని పసుపల గ్రామ సచివాలయంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంప్ ఏర్పాటు చేస్తున్నామని ఎంపీడీఓ శివరామయ్య తెలిపారు. డాక్టర్లు శివశంకరుడు,లక్ష్మీ తదితరులు ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచిత మందులను పంపిణీ చేస్తారన్నారు. హెల్త్ క్యాంప్‌ను సచివాలయం పరిధిలోని గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సూచించారు.

రక్త దాన శిబిరం

డోన్ టౌన్ : పట్టణంలోని సాయి ఫంక్షన్ హాల్‌లో శనివారం ఉదయం 9గంటల నుంచి రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న ఈ రక్తదాన శిబిరాన్ని డీఎస్పీ శ్రీనివాసరెడ్డి ప్రారంభిస్తారని, యువత రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని ఆయన కోరారు.

తీరిన ప్రహరీ సమస్య !

- ఎమ్మెల్యే కాటసాని చొరువతో రూ.69 లక్షలు మంజూరు
- ముస్లిం శ్మశాన వాటికకు రక్షణ గోడ నిర్మాణం పూర్తి
- సంతోషం వ్యక్తం చేస్తున్న ముస్లిం సోదరులు


ముస్లింల శ్మశాన వాటిక


శ్మశానవాటి చుట్టూ ప్రహరీ నిర్మించిన దృశ్యం

బనగానపల్లె రూరల్ : మండల కేంద్రం బనగానపల్లె పశువైద్యశాల వెనుక ఉన్న మాసుంబాషా దర్గాలోని ముస్లిం సోదరులు శ్మశాన వాటిక అస్తవ్యస్తంగా మారింది. ఏళ్లతరబడి ఈ శ్మశాన వాటికకు ప్రహరీ లేకపోవడంతో పందులుతో పాటు పశువులకు నిలయంగా మారింది. గత టీడీపీ పాలనలో అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులకు ముస్లిం పెద్దలు సమస్యను విన్నవించినా స్పందన లేదు. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముస్లిం పెద్దలు సమస్యలను ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కాటసాని ప్రత్యేక చొరువ తీసుకుని ఉన్నతాధికారులతో మాట్లాడి ప్రహరీ నిర్మాణానికి సీఎండీఎఫ్ నిధులు రూ. 69 లక్షలు మంజూరు చేయించారు. ఈ మేరకు చేపట్టిన రక్షణగోడ నిర్మాణం పూర్తయింది. శ్మశాన వాటికకు ప్రహరీ నిర్మాణం పూర్తయిందని, త్వరలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి చేతుల మీదుగా ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పంచాయతీరాజ్ డీఈఈ నాగశ్రీనివాసులు తెలిపారు. ఏళ్లతరబడి నెలకొన్న ప్రహరీ సమస్య తీరడంతో ముస్లిం సోదరులు ప్రభుత్వంతోపాటు ఎమ్మెల్యే కాటసానికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.